క్లుప్తంగా

నేడు రేషన్ కార్డుల పంపిణీ

మోతె : మోతె మండల కేంద్రంలో శుక్రవారం లబ్ధిదారులకు కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి పలువురు పార్టీ కార్యకర్తల కుటుంబా ల ను పరామర్శించనున్నట్లు తెలిపారు. రేషన్ కా ర్డుల పంపిణీ కార్యక్రమంలో మండల ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు.

క్షయ నిర్ధారణ శిబిరం



శిబిరంలో పాల్గొన్న వైద్యసిబ్బంది, ప్రజలు

నడిగూడెం : క్షయ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడాలని వైద్యారోగ్య శాఖ సూపర్‌వైజర్ గుర్రం విజయ్‌కుమార్ సూచించారు. గురువారం మండలంలోని కాగితరామచంద్రాపురం ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో నిర్వహించిన క్షయ వ్యాధి నిర్ధారణ ప్రత్యేక వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. క్షయ వ్యాధి నోడల్ పర్సన్ కృష్ణమూర్తి, ఎంఎల్‌హెచ్‌పీ మహేశ్వరి, ఏఎన్ఎం రమాదేవి, ఆశా కార్యకర్తలు ఉమ, ధనలక్ష్మి, శుక్లావతి పాల్గొన్నారు.

మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి



వంట గదిలో భోజనాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

కోదాడరూరల్ : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీఓ, బాలాజీనగర్ గిరిజన ఆశ్రమ పాఠశాల వసతి గృహానికి ప్రత్యేక అధికారి ఇస్సాక్ హుస్సేన్ అన్నారు. గురువారం ఆశ్రమ పాఠశాల వసతి గృహాన్ని ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. వంట గదిలో ఆహార పదార్థాలను పరిశీలించి, మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా.. లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్ ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూ నాగజ్యోతి, సిబ్బంది ఉన్నారు.

మునగాలలో వైభవంగా ముత్యాలమ్మ పండుగ



అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్న మహిళలు

మునగాల : మండల కేంద్రంలో గురువారం ముత్యాలమ్మ పండుగను గ్రామస్తులు వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో వెళ్లి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తులు అమ్మవారికి కోళ్లను బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

శ్మశానవాటిక నిర్మాణానికి 'మైహోం' సాయం

మేళ్లచెరువు : మండల కేంద్రంలో మున్నూరు కాపు శ్మశానవాటిక నిర్మాణానికి స్థానిక మైహోం సిమెంట్ పరిశ్రమ సాయం అందించింది. శ్మశాన వాటికకు ప్రహరీ, ఆర్చీ నిర్మాణానికి గురువారం మైహోం సిమెంట్ పరిశ్రమ ప్లాంట్ హెడ్ శ్రీనివాసరావు రూ.10 లక్షల చెక్కును మున్నూరుకాపు సంఘం సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బండి భిక్షమయ్య, లక్ష్మయ్య, కమతం శ్రీనివాసరావు, బుస్సా ఉపేందర్, వెంకటరావు, బాబు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

నేరేడుచర్ల : మేడ్చల్‌లో ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు జరగనున్న సీపీఐ 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు దూళిపాల ధనుంజయనాయుడు కోరారు. గురువారం నేరేడుచర్లలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ పేదల కోసం రాజీలేని పోటాలు నిర్వహిస్తుందని తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు ఎల్లబోయిన సింహాద్రి, చిలకరాజు శ్రీను, వెంకన్న, వెంకట్, భరత్ తదితరులు ఉన్నారు.

పౌరహక్కులపై అవగాహన

మోతె : మండలంలోని నేరడవాయి గ్రామంలో గల ఎస్సీ కాలనీలో గురువారం పౌరహక్కులపై మోతె ఏఎస్ఐ సత్యనారాయణ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యపై శ్రద్ధ చూపాలన్నారు. యువత మంచి మార్గంలో నడవాలన్నారు. మహిళలు విద్యతో సమాజంలో గౌరవం, మర్యాదలు పొందవచ్చన్నారు. ప్రతిఒక్కరూ పౌరహక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కరుణాకర్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్లు

మేళ్లచెరువు : మేళ్లచెరువు మండల కేంద్రంలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. మండల కేంద్రంలోని వెంకట్రామాపురం క్రాస్‌రోడ్డులో, మెయిన్‌రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. గుంతల్లో వర్షపు నీరు నిలుస్తోంది. దీంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో వాహనదారులకు గుంతలు కనపడక ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. అదేవిధంగా చింతలపాలెం మండల కేంద్రంలోని మేళ్లచెరువు రోడ్డుపై గుంత ఏర్పడి నెలలు గడుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



చింతలపాలెం మండల కేంద్రంలో రోడ్డుపై ఏర్పడిన గుంత



మేళ్లచెరువు మండల కేంద్రంలోని వెంకట్రామాపురం రోడ్డులో..



మేళ్లచెరువులోని మెయిన్‌రోడ్డులో..

ది కోదాడ కాన్వాసింగ్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



ప్రమాణాస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

కోదాడరూరల్ : ది కోదాడ కాన్వాసింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం పట్టణంలోని సాలార్జంగ్ పేటలో గల ఆ సంఘం కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అర్వపల్లి హనుమంతరావు, ప్రధాన కార్యదర్శిగా గడ్డం రాంబాబు, ఉపాధ్యక్షుడిగా చాప గోవిందరావు, సహాయ కార్యదర్శిగా ఓరుగంటి శ్రీనివాసరావు, కోశాధికారిగా సముద్రాల బద్రీష్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు ప్రమాణాస్వీకారం చేశారు. అదేవిధంగా గుమస్తాల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అనంతు సైదులు, ఉపాధ్యక్షుడిగా వెంకటరాజారావు, ప్రధాన కార్యదర్శిగా వేమూరి నరసింహామూర్తి, సహాయ కార్యదర్శిగా కొల్ల సురేష్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో గట్ల కోటేశ్వరరావు, అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పిన్నపురెడ్డి వీరారెడ్డి, ఓరుగంటి ప్రభాకర్, వెంపటి వెంకటేశ్వరరావు, వెంపటి మధుసూదన్, గుడుగుంట్ల రఘు, పురుషోత్తం, ప్రకాష్, పర్వతాలు, అలీబాయ్, సాయి, వీరయ్య తదితరులు ఉన్నారు.

సేవలతోనే సమాజంలో గుర్తింపు

● డీఐఈఓ భానునాయక్



ప్రిన్సిపాల్ కృష్ణయ్య దంపతులను సన్మానిస్తున్న డీఐఈఓ భానునాయక్, అధ్యాపకులు

హుజూర్‌నగర్ : ఉద్యోగి అందించిన సేవలతోనే సమాజంలో లభిస్తుందని డీఐఈఓ భానునాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని హుజూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జానపాటి కృష్ణయ్య పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణయ్య దంపతులను శాలువాతో సన్మానించి మాట్లాడారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ గుంటుపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు విజయనాయక్, మృత్యుంజయ, అధ్యాపకులు మారం హేమచందర్, ముస్తఫా, బ్రహ్మాచారి, శ్రీనివాస్‌రెడ్డి, నాగుల్‌మీరా, రమేష్, నరసింహారావు, ఉపేంద్ర, శోభారాణి, అరుణ్, జ్యోతి, మహేష్, తేజ, తిరుమలరావు, శ్రీకాంత్, రామ్మూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

విప్లవ కిరణం.. పూనెం లింగన్న



కోదాడరూరల్ : లింగన్న చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు

కోదాడరూరల్ : ఆదివాసీల సమస్యలపై పోరాడి వారి గుండెల్లో నిలిచిన విప్లవ కిరణం పూనెం లింగన్న అని అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని లాల్ బంగ్లాలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు పూనెం లింగన్న 6వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉదయగిరి మాట్లాడుతూ.. ఆదివాసీల హక్కుల కోసం, పోడు భూముల పట్టాల పరిరక్షణ కోసం ఇల్లందు ప్రాంతంలో పీడిత ప్రజల పక్షాన లింగన్న పోరాటాలు చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి వక్కవంతుల నరసింహారావు, విజయ్, పోకల మైసయ్య, రవితేజ, నరసింహరావు, కొండలు, సలీం, ఖాసీం, చోటు, సాలమ్మ, వెంకన్న ఉన్నారు.

● బోనమెత్తిన విద్యార్థులు



నేరేడుచర్ల : పట్టణంలోని శ్రీఅంజలి స్కూల్‌లో గురువారం బోనాల పండుగను ఉపాధ్యాయులు, విద్యార్థులు వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు బోనాలను తలపై ఎత్తుకొని పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పాఠశాలకు చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. పలువురు విద్యార్థులు పోతరాజుల వేషాధారణలో విన్యాసాలు చేసి ఆకట్టుకున్నారు.


రామాలయం స్థలంలో బెల్ట్ షాపులు!

అనంతగిరి : మండలంలోని వెంకట్రాంపురం, కోదాడ మండలంలోని రామిరెడ్డిపాలెం గ్రామాల సెంటర్‌లో గల రామాలయం స్థలంలో కొందరు బెల్ట్ షాపులు ఏర్పాటు చేశారని, వాటిని తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. బెల్ట్ షాపుల ఏర్పాటుతో రామాలయం పరిసరాలు ఖాళీ మద్యం సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులు, చెత్తచెదారంతో నిండిపోతున్నాయని, రామాలయంలో పూజలు నిర్వహించుకునేందుకు వెళ్లే అక్కడ మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రామాలయం ఎదుట నూతన బస్టాండ్ నిర్మించేందుకు గ్రామస్తులు ముందుకొచ్చి నిధులు సమీకరించినా అక్కడ బెల్ట్ షాపులు ఉండటంతో బస్టాండ్ నిర్మాణం ఆగిపోయిందని చెబుతున్నారు. రాత్రి 12 గంటల వరకు అక్కడ మద్యం సేవిస్తుండటంతో వెంకట్రాంపురం ఇందిరమ్మ కాలనీ, రామిరెడ్డిపాలెంకు చెందిన మహిళలు ఇంటి నుంచి బయటకు రావాలంటేనే భయాందోళనకు గురి అవుతున్నారని పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి అక్రమ బెల్ట్ షాపులపై చర్యలు తీసుకొని, వాటిని తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఎనిమిది గేట్ల ద్వారా నీటి విడుదల

మేళ్లచెరువు : చింతలపాలెం మండలంలో కృష్ణానదిపై ఉన్న పులిచింతల ప్రాజెక్టుకు వరదనీరు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు అధికారులు గురువారం ఎనిమిది గేట్లను మూడు మీటర్ల మేర ఎత్తి 1,87,904 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతల ప్రాజెక్టుకు నాగార్జునసాగర్ నుంచి 2,04,904 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. కాగా, ఈ ప్రాజెక్టులోని తెలంగాణ వైపు ఉన్న విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా 100 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు తెలంగాణ జెన్‌కో ఎస్ఈ దేశ్యా నాయక్ తెలిపారు.

పెట్టుబడి తక్కువ.. దిగుబడి ఎక్కువ



తెల్లబల్లిలో డ్రమ్‌సీడర్ పద్ధతిలో వరి విత్తనాలు విత్తుతున్న రైతులు

నడిగూడెం : మండలంలోని తెల్లబల్లి గ్రామానికి చెందిన యువ రైతు సాగర్ల నరేష్ తన కున్న నాలుగు ఎకరాల వ్యవసాయ భూమిలో గురువారం డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి సాగు చేపట్టాడు. ప్రస్తుత సీజన్‌లో నాటు వేసి సాగు చేసేందుకు కూలీల కొరత ఉండడంతో డ్రమ్‌సీడర్ పద్ధతిలో సాగు చేపట్టినట్లు నరేష్ తెలిపారు. ఈ విధానంలో నారు పెంచడం, కూలీల ఖర్చులు ఉండవని, పంట కూడా 10 రోజులు ముందుగానే కోతకు వస్తుందని, పంట దిగుబడి కూడా అదనంగా వస్తుందని తెలిపారు.

చెరువు శిఖం స్వాధీనం



చెరువు శిఖం భూమికి హద్దు రాళ్లు ఏర్పాటు చేయిస్తున్న అధికారులు

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల గ్రామ పరిధిలోని ఊర చెరువు శిఖం భూమిని గురువారం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. చెరువు శిఖం భూమిని పలువురు ఆక్రమించుకొని వరి నాట్లు వేసుకుంటున్నారని ఫిర్యాదులు రావడంతో నేరేడుచర్ల తహసీల్దార్ సురిగి సైదులు ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు శిఖం భూమిని గుర్తించి స్వాధీనం చేసుకొని హద్దు రాళ్లు ఏర్పాటు చేశారు. ఆయన వెంట ఇరిగేషన్ డీఈ అమరేందర్‌రెడ్డి, ఏఈలు శ్రీనివాస్, నవీన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాము తదితరులు ఉన్నారు.

పేద విద్యార్థులకు కత్రం ట్రస్ట్ చేయూత



విద్యార్థికి చెక్కు అందిస్తున్న కత్రం ట్రస్ట్ నిర్వాహకులు

కోదాడ : ఐఐటీ, ఎన్ఐటీలో సీట్లు సాధించిన ఇద్దరు పేద విద్యార్థులకు కోదాడకు చెందిన కత్రం చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. చదువుకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న వారికి కత్రం విద్యా చేయూత పేరుతో ఆర్థికసాయం అందజేశారు. అనంతగిరి మండలంలోని మొగలాయికోటకు చెందిన నెమ్మాది శ్రావ్య ఐఐటీ పాల్కాడ్‌లో సీటు సాధించింది. విద్యార్థిది నిరుపేద కుటుంబం కావడంతో సెమిస్టర్ ఫీజు చెల్లించలేక కత్రం చారిటబుల్‌ట్రస్ట్ చైర్మన్ కత్రం శ్రీకాంత్‌రెడ్డిని సాయం కోరడంతో గురువారం గ్రామస్తుల సమక్షంలో మొదటి సెమిస్టర్ ఫీజును చెక్కు రూపంలో అందించారు. అదేవిధంగా మోతె మండల కేంద్రానికి చెందిన బానోతు సంజీవ్ నాయక్ ఎన్ఐటీ ఢిల్లీలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. ఇతని రెండు సెమిస్టర్ల ఫీజును శ్రీకాంత్‌రెడ్డి తరుపున ట్రస్ట్ సభ్యులు బుధవారం అతనికి అందజేశారు. ఈ సందర్భంగా విద్యాచేయూత పథకం ద్వారా సాయం అందిస్తున్న శ్రీకాంత్‌రెడ్డిని పలువురు అభినందించారు. కార్యక్రమాల్లో కత్రం ట్రస్ట్ సభ్యులు, కిష్టాపురం, మొగలాయికోట గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనే ఎర్రజెండా లక్ష్యం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



సంతాప సభలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

గరిడేపల్లి : సమసమాజ స్థాపనే లక్ష్యంగా ఎర్రజెండా పనిచేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. గురువారం గరిడేపల్లి మండలంలోని కీతావారిగూడెంలో నిర్వహించిన ఆ గ్రామ మాజీ సర్పంచ్, కమ్యూనిస్టు సీనియర్ నాయకుడు రాచమల్ల రామస్వామి సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటి ఆధునిక సమాజంలో అభివృద్ధి వైపు పరిగెడుతున్న ప్రపంచానికి దీటుగా మన దేశం ముందుకెళ్లాలంటే నిస్వార్థంగా, అంకితభావంతో పనిచేసే నాయకత్వం కావాలన్నారు. ఎన్నికలను వ్యాపారంగా మార్చి బూర్జువా పార్టీలు అధికారం దక్కించుకుంటున్నాయని, దీంతో ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదని అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పుతోందని ఆరోపించారు. 11 సంవత్సరాల మోదీ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసి, దేశ ప్రజాస్వామిక వ్యవస్థను విచ్ఛిన్నం చేసే కుట్ర పన్నుతోందని ఆరోపించారు. కుల, మతాలకు అతీతంగా కమ్యూనిస్టులు ఉద్యమాలు చేస్తున్నారని అన్నారు. ఎర్రజెండా సిద్ధాంతాన్ని నమ్మి చివరి వరకు ప్రజల కోసం పనిచేసిన రామస్వామి చిరస్మరణీయుడని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగారపు పాండు, ములకలపల్లి రాములు, మట్టపల్లి సైదులు, జిల్లా కమిటీ సభ్యులు పల్లె వెంకటరెడ్డి, యాకూబ్, ప్రకాష్, బ్రహ్మం, వెంకటేశ్వర్లు, హుస్సేన్, బాలునాయక్, రాములు, వెంకటరెడ్డి, సైదా, సైదులు, రజిత, సైదయ్య, సోమయ్య, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్‌దారుల సదస్సును జయప్రదం చేయాలి



కోదాడరూరల్ : సమావేశంలో పాల్గొన్న ఎంఎస్‌పీ నాయకులు, పింఛన్‌దారులు

అనంతగిరి : హుజూర్‌నగర్‌లో ఆగస్టు 1వ తేదీన జరిగే చేయూత పెన్షన్‌దారుల జిల్లా సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర మహిళా నాయకురాలు రావి స్నేహలత చౌదరి, ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజు మాదిగ కోరారు. గురువారం అనంతగిరి మండలంలోని అమీనాబాద్‌లో నిర్వహించిన చేయూత పెన్షన్‌దారుల సమావేశంలో వారు మాట్లాడారు.చేయూత పెన్షన్‌దారులు దొంగరి కృష్ణమూర్తి, బొంకూరి నర్సమ్మ, సుంకరి లక్ష్మీనర్సయ్య, ముత్తినేని రత్తమ్మ, రాములమ్మ, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్‌దారులు అధికసంఖ్యలో పాల్గొనాలి

చిలుకూరు :హుజూర్‌నగర్‌లో శుక్రవారం నిర్వహించబోయే వీహెచ్‌పీఎస్ చేయూత పెన్షన్‌దారుల జిల్లా సన్నాహక సభలో పెన్షన్‌దారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు కొండపల్లి ఆంజనేయులు మాదిగ కోరారు. గురువారం చిలుకూరు మండలంలోని జెర్రిపోతులగూడెం గ్రామంలో నిర్వహించిన వీహెచ్‌పీఎస్, చేయూత పెన్షన్‌దారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు మాతంగి వీరస్వామి, మల్లెపంగు సూరిబాబు, సైదా, సత్యనారాయణ, శివమ్మ, వెంకమ్మ, సీత, ప్రమీల, లక్ష్మీబాయి, ఆదెమ్మ, అంజమ్మ, అచ్చమ్మ, కాంతమ్మ, సత్యనారాయణ, సత్యం, రాములు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్ పెంచాలి

కోదాడరూరల్ : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగుల పింఛన్‌ను రూ.6వేలకు, చేయూత పింఛన్ రూ.4వేలకు పెంచాలని ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజు మాదిగ కోరారు. గురువారం మండలంలోని చిమిర్యాల, కాపుల్లులో నిర్వహించిన పింఛన్‌దారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పింఛన్ల పెంపు కోసం శుక్రవారం హుజూర్‌నగర్ కేంద్రంలో నిర్వహిస్తున్న దివ్యాంగుల, చేయూత పింఛన్‌లదారుల సన్నాహక సమావేశానికి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ నాయకులు కర్ల విజయరావు, పులి నాగేశ్వరరావు, దావీదు, ఏసోబు, సైదులు, భాస్కర్, మీగడ శ్రీను, వెంకటేశ్వర్లు, మహాలక్ష్మి, తిరపమ్మ, జ్యోతి తదితరులు ఉన్నారు.

జాతీయ ఓబీసీ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు, మహిళలు

మఠంపల్లి : గోవా రాష్ట్రంలోని పనాజీ నగరంలో గల శ్యాంప్రసాద్ ముఖర్జీ స్టేడియంలో ఆగస్టు 7న జరగనున్న అఖిల భారత జాతీయ ఓబీసీ 10వ మహాసభను జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు కోరారు. గురువారం మఠంపల్లి మండల కేంద్రంలో ఆ సంఘం నాయకులతో కలిసి మహాసభ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి వంగరి బ్రహ్మం, బీసీ సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు ఇంటి అచ్చమ్మ, ప్రధాన కార్యదర్శి కక్కిరేణి నాగమణిగౌడ్ మాధవి, నాగమణి, మమత, ధనమ్మ, తేజ, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మోతె : రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోస్‌రెడ్డి, ఎంపీడీఓ ఆంజనేయులు అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు నామవరం, హుస్సేన్‌బాద్ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పశువుల కొట్టాల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు ఎలుగు వీరన్న, లింగయ్య, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



హుస్సేన్‌బాద్‌లో పశువుల కొట్టం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీడీఓ ఆంజనేయులు

సమాజ భద్రతకే కార్డన్ సెర్చ్

● కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

నడిగూడెం : సమాజ భద్రత కోసమే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం నడిగూడెం మండల కేంద్రంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తులు విక్రయించే వాహనాలను కొనుగోలు చేయవద్దన్నారు. వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. ధ్రువీకరణ పత్రాలు లేకపోతే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్డన్ సెర్చ్‌లో సరైన పత్రాలు లేని 41 బైక్‌లు, 4 ఆటోలు సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్డన్ సెర్చ్‌లో మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, నడిగూడెం ఎస్ఐ జి.అజయ్‌కుమార్, డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు హుజూర్‌నగర్‌కు మంద కృష్ణమాదిగ రాక

హుజూర్‌నగర్ : పట్టణంలో శుక్రవారం నిర్వహించబోయే చేయూత పింఛన్‌దారుల జిల్లా సన్నాహక సదస్సుకు పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా రానున్నట్లు భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ తెలిపారు. గురువారం ఆయన హుజూర్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ చేయూత పింఛన్‌దారులు సదస్సును విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కృష్ణా పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్ : కృష్ణా నదికి వరదలు పోటెత్తుతున్నందున నది పరీవాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ చరమందరాజు సూచించారు. గురువారం హుజూర్‌నగర్ పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు డ్యామ్ క్రస్ట్ గేట్లు ఎత్తడంతో వరద ప్రవాహం అతివేగంతో దిగువ ప్రాంతానికి వస్తుందని తెలిపారు. నియోజకవర్గంలోని పాలకవీడు, మఠంపల్లి, చింతలపాలెం మండలాల్లో కృష్ణా నది ఒడ్డున ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తమై సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని చెప్పారు. పశువులు మేపడానికి, వ్యవసాయ మోటార్ల కోసం నది వద్దకు వెళ్లే ప్రయత్నించవద్దన్నారు. నదిలో చేపల వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. అధికారుల సహకారం, సూచనల మేరకు తీర గ్రామల ప్రజలు స్పందించాలని, ఎలాంటి ఇబ్బందులు కలిగినా వెంటనే పోలీసు అత్యవసర సేవా విభాగం 100 కాల్ చేయాలని ఆయన సూచించారు.

బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి

మోతె : బడీడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని మోతె మండల ప్రత్యేకాధికారి సీతారాం నాయక్ అన్నారు. గురువారం మండలంలోని రాఘవాపురం ఎక్స్ రోడ్డు గ్రామంలో ఆయన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయులు, ఎంఈఓ గోపాల్‌రావు, పంచాయతీ కార్యదర్శి సంపత్‌కుమార్, ఉపాధ్యాయురాలు రేణుక, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రక్తదానం

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న నేరేడుచర్లకు చెందిన నకిరేకంటి ప్రసాద్‌కు సర్జరీ నిమిత్తం రెండు యూనిట్ల ఏ నెగిటివ్ రక్తం అత్యవసరమైంది. దీంతో గురువారం వారు జనచైతన్య ట్రస్ట్ సభ్యులను సంప్రదించడంతో అనిల్, సీతారాంపురంనకు చెందిన రాజుతో మాట్లాడి ఏ నెగిటివ్ రక్తదానం చేయించారు. దీంతో వారిని పలువురు అభినందించారు.

విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ చత్రునాయక్

గరిడేపల్లి : ప్రతి విద్యార్థిలో కనీస సామర్థ్యాలు పెంపొందించాలని గరిడేపల్లి మండల విద్యాధికారి చత్రునాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో మండలంలోని ప్రధానోపాధ్యాయులకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎం.సువర్ణ, నాగమణి, కనకయ్య, నర్సకుమారి, ఎంఐఎస్ కోఆర్డినేటర్ నాగేంద్రమ్మ, సీఆర్పీలు రామకృష్ణ, అశోక్‌కుమార్, ఉమ, రాములు, వెంకటేశ్వర్లు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.